క్లుప్తంగా

అంకమ్మ తల్లికి డాక్టర్ గణేష్ పూజలు



చెరుకుపల్లి (రేపల్లె రూరల్): చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం పంచాయతీలోని పిట్టువారిపాలెం గ్రామంలో నెలకొన్న పిట్టువారి ఇలవేల్పు సముద్రాల అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు పిట్టు సాంబశివరెడ్డి, నిజాంపట్నం కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పిట్టు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిట్టు సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల సహాయ సంచాలకులు నాంచారయ్యకు సత్కారం



రేపల్లె రూరల్: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకట మురళీ చేతుల మీదగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బెల్లంకొండ నాంచారయ్యను డివిజన్ పరిధిలోని పశు వైద్యులు పట్టణంలోని పశు వైద్యశాలలో సోమవారం సత్కరించారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించటంతో పాటు వరదల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పశువులకు ప్రాణనష్టం జరగకుండా చూసుకోవటమే కాకుండా పచ్చిగడ్డి కొరత సమయంలో తన సొంత ఖర్చులతో 14 ట్రాక్టర్ల వరిగడ్డిని వరద ప్రభావిత ప్రాంతాలలోని పాడి రైతులకు అందించారు. ఈ నేపథ్యంలో నాంచారయ్య పురస్కారాన్ని అందుకోవటం ఆనందంగా ఉందని పలువురు పశు వైద్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రేపల్లె మండల పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, బొబ్బర్లంక పశు వైద్యాధికారి మీనాక్షి దేవి, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. పచ్చపాతం

- నిర్మాణ పనులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పునాదులకు పరిమితమైన రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాలు



పెరవలిపాలెంలో పునాదులకు పరిమతమైన వెల్ నెస్ కేంద్రం

పెరవలిపాలెం (వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉన్నా కూటమి ప్రభుత్వం రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాలు గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో గత ప్రభుత్వం రైతులకు సేవలు అందించేందుకు రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గ్రామ స్థాయిలో రూ.17.5 లక్షలతో వెల్ నెస్ కేంద్రం మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన వ్యక్తులకు బిల్లులు కూడా చెల్లించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాల గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అవి పునాదులకే పరిమితం అయ్యాయి. గత ప్రభుత్వం రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాలకు జాతీయ గ్రామీణ ఉపాధి నిధులు మంజూరు చేసినా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అవి నిర్మాణం చేయకుండా, సిమెంట్ రోడ్లు వేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

చిన్న చిన్న రోగాలకు వైద్యం

గ్రామాల్లో చిన్న చిన్న రోగాలకు ప్రైవేటు వైద్యశాల లేదా, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లేదా సామాజిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వెల్ నెస్ కేంద్రం ఏర్పాటు చేస్తే చిన్న చిన్న రోగాలకు వైద్యం పొందేందుకు వీలు కలుగుతుందని వారు వాపోతున్నారు.

అద్దె భవనంలోనే...

రైతు భరోసా కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతుంది. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. రైతు భరసా కేంద్రం భవనం నిర్మాణం పూర్తయితే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వ్యవసాయ సూచనలు ఇచ్చేందుకు వీలు కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని గ్రామంలో రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



పెరవలిపాలెంలో పునాదులకు పరిమతమైన రైతు భరోసా కేంద్రం

కూటమి ప్రభుత్వం పక్షపాతం



రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రం నిర్మాణంలో ప్రభుత్వం పక్షపాతం వహిస్తోంది. కూటమి ప్రభుత్వం వెంటనే గ్రామంలో రైతు భరోసా , వెల్ నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వీటి వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది.

– లంక శ్రీనివాసరరావు, పెరవలి పాలెం

నిధులు ఉన్నాయి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు బిల్లులు కూడా చెల్లించడం జరిగింది. రైతు భరోసా, వెల్ నెస్ కేంద్రాలకు నిధులు కూడా ఉన్నాయి.

– సత్య కృష్ణ, ఏపీవో, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం

బాలకోటయ్య తిరునాళ్ల విజయవంతం చేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు



తిరునాళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అరవపల్లిలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా అరవపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్లకు పాత గుంటూరు జిల్లాతో పాటు పాత కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రేపల్లె నుంచి అరవపల్లికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటంతో పాటు గ్రామంలో బస్సులను నిలుపుకునేందుకు స్థలాన్ని పరిశీలించాలన్నారు. పోలీసు అధికారులు తిరునాళ్లలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను అప్రమత్తం చేస్తూ దొంగతనాలకు తావువివ్వకుండా సిబ్బందితో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పశు వైద్యాధికారులు సైతం అందుబాటులో ఉండి పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఆలయ సమీపంలో నీటితో నింపిన ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. తిరునాళ్ల మహోత్సవాలకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయం వద్ద ఉచిత ప్రసాదం స్టాళ్లను ఏర్పాటు చేయదలిస్తే ముందుగా ఆలయ అధికారులకుగానీ, తహసీల్దార్ కార్యాలయంలోగానీ అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శోభారాణి, ఆలయ కార్యనిర్వహణాధికారి దివి అప్పలాచార్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. 374–2 సర్వే నంబరులో తనకు ఎటువంటి భూమి లేదని, అయినప్పటికీ ఆ సర్వే నంబరులో తన పేరు నమోదై ఉందని, వెంటనే తన పేరును తొలగించాలని కోరుతూ పోటుమెరక గ్రామానికి చెందిన ముత్తిరెడ్డి గురునాథరావు అర్జీ అందించారన్నారు. తన నివాస స్థలం సర్వే చేసి సర్టిఫికెట్ అందించాలని రేపల్లె నుంచి ఆలూరి తిరుపతి కుమార్, భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన నన్నెపాముల నాగేశ్వరరావు శ్మశానానికి భూమిని మంజూరు చేయాలని దరఖాస్తు అందించారన్నారు. తమపై ఫిర్యాదులు చేస్తామంటూ కొలసాని రామచంద్రయ్య, వారి కుటుంబ సభ్యులు పదే పదే బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన అద్దేపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడని చెప్పారు. 4 అర్జీలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు.

నేడు గ్రామ పార్టీ అధ్యక్షుల నియామకం

వేమూరు: వేమూరు మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి, వెల్లబాడు, చదలవాడ గ్రామాల్లో మంగళవారం గ్రామ పార్టీ అధ్యక్షుల ఎన్నిక పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. బలిజేపల్లి గ్రామంలో సాయంత్రం 4 గంటలకు, 5 గంటలకు వెల్లబాడు గ్రామంలో, 6 గంటలకు చదలవాడ గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత



నిజాంపట్నం: మండలంలోని ముత్తుపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు స్కూల్ పూర్వపు ఉపాధ్యాయిని మెరుగుపాల కమలకుమారి సోమవారం చేయూతనిచ్చారు. పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తించిన కమలకుమారి తన తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు స్టీలు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వనజాక్షి, మాజీ సర్పంచ్ మెరుగుపాల సలీమ్, ఉపాధ్యాయులు నాగబసవయ్య, నాగరాజు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ అభివృద్ధికి అధికారులు సహకరించాలి



వేమూరు: మండల పరిషత్ అభివృద్ధికి అధికారులందరు సహకరించాలని ఎంపీపీ యల్లమాటి మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి పనులు వివరాలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు సక్రమంగా సహకరించడం లేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ప్రతి కూలీకి పని కల్పించాలని అన్నారు. గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నాణ్యమైన సిమెంట్ రోడ్లు వేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అధికారి సహకరిస్తేనే మండల పరిషత్ అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గాజుల హేమలత, ఉపాధ్యక్షుడు షేక్ బాజీ ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు దాతల చేయూత



నిజాంపట్నం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధమవ్వగా రూ.2 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి సింగోతి మస్తాన్‌రావుకు చెందిన పూరింటి విద్యుత్ బోర్డు నుంచి మంటలు వ్యాపించి గృహానికి అంటుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ బండ పేలి పక్కనే ఉన్న నాగమణి, శ్రీలక్ష్మి గృహాలపై పడింది. దీంతో ఆ గృహాలు సైతం పూర్తిగా దగ్ధమయ్యాయి. రేపల్లె అగ్నిమాపక శకటం, స్థానికులు శ్రమించి మంటలను అదుపు చేశారు. సోమవారం ఉదయం పలువురు దాతలు బాధితులకు చేయూతనిచ్చారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మూడు కుటుంబాల సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నాయుడు గోపి, సాయిబాబు, మీరయ్య, ఖాదర్ బాబు, మోహనరావు తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలి

–ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేంద్ర



రేపల్లె రూరల్: ఐకమత్యంతో అసంఘటిత రంగంలోని ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌లు తమ సమస్యలను పరిష్కరించుకునేలా పని చేయాలని రేపల్లె ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకిరెడ్డి ఉపేంద్ర అన్నారు. జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపల్లె ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్‌లు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి సభ్యునికి రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. పేద ఎలక్ట్రీషియన్‌లకు నివేశన స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేసి అందించాలన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రీషియన్‌ల కుటుంబాలకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించి కార్యాలయం ఏర్పాటుకు సహకరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే పథకాలు పొందేందుకు ప్రతి సభ్యుడికి బీటీసీ కార్డు తప్పనిసరని పేర్కొన్నారు. కార్డు కలిగిన సభ్యులు రెన్యూవల్ చేసుకోవాలని, లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత ఓల్డ్‌టౌన్‌లోని అంకమ్మ చెట్టు వద్ద నుంచి ఇసుకపల్లి వరకు పట్టణంలో ఎలక్ట్రీషియన్‌లు బైక్ ర్యాలీ నిర్వహించి ఐక్యతను చాటారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌర్రిపర్తి మణికంఠ, కార్యదర్శి పఠాన్ షంషుద్దీన్, కోశాధికారి హరిదాసు భరత్‌కుమార్, మాజీ అధ్యక్షుడు నీలా లక్ష్మణబాబు, గౌరవ సలహాదారుడు ఆలపాటి ఉదయభాస్కర్, సభ్యులు రేపల్లె శ్రీరామమూర్తి, అబ్దుల్ ఖదీర్ పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



పెరవలి గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి పోతురాజుతో వరికూటి అశోక్‌బాబు


పెరవలి(వేమూరు): పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాలని పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామం, వేమూరు మండలంలోని పెరవలి, కుచ్చెళ్లపాడు, కాకర్లమూడి గ్రామాలలో గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక నిర్వహించడం జరిగిందన్నారు. మోపర్రు గ్రామంలో కొండపల్లి వినయ్, పెరవలి గ్రామంలో దాసరి పోతురాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి నాయకులకు ప్రాధాన్యం, పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అమర్తలూరు మండల పార్టీ అధ్యక్షుడు హేమచంద్ర శ్రీనివాసరరావు, వేమూరు మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, మాజీ ఎంపీటీసీ దాసరి మోహనరావు, పట్టెల రంగబాబు, దాది కాకులేశ్వరరావు, దున్నా మేరీసుబాబు, ఎంపీటీసీ దాది రజిని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు లారీ ఢీ



కొల్లూరు : ఆర్టీసీ బస్సు, ఓ లారీ ఇరుకైన మార్గంలో ఒకదానికి ఒకటి ఢీ కొన్న ఘటన కొల్లూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి కొల్లూరు వైపు వస్తుంది. అదే సమయంలో కరకట్టపైన కొల్లూరు వైపు నుంచి ఇటుకరాయి లోడ్‌తో లారీ వెళుతుంది. కరకట్టపైన వాహనం తప్పుకోవడానికి సైతం వీలు లేని ఇరుకైన మార్గం కావడంతో రెండు వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురై పక్క నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు కుడివైపున లారీ చక్రం బోల్టులకు తాకింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు స్వల్పంగా ధ్వంసమైంది. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొల్లూరు సమీపంలో ఎదురెదురు వాహనాలు తప్పుకునే వీలులేకుండా ప్రమాదకరంగా ఉన్న కరకట్టను తక్షణం విస్తరించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు చెరుకుపల్లి విద్యార్థులు



చెరుకుపల్లి (రేపల్లె రూరల్): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రమైన చెరుకుపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఇరువురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన నకరికల్లులో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో కాటూరి వాసంతి, తుమ్మ ఉమాహర్షితలు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన పీఈటీ కాటూరి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం



వేమూరు: గోకుల షెడ్డుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. గుంటూరు క్యాంపు కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పశువుల షెడ్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మండల స్థాయిలో ఎన్ని షెడ్‌ల నిర్మాణం చేపట్టడం జరిగింది, మిగిలిన షెడ్‌లు నిర్మాణం ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. వేసవి సీజన్‌లో కూలీలందరికీ పనులు కల్పించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఏపీవోలు పాల్గొన్నారు.